## క్లుప్తంగా

### గోశాలకు రాజన్న కోడెలు



గోశాలకు కోడెలు అందజేస్తున్న అధికారులు

**వేములవాడఅర్బన్:** వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను జనగామ జిల్లా లింగాల ఘన్‌పూర్ మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన బహుజన గోశాలకు 20 కోడెలను మంగళవారం అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ ఉన్నారు.

### పంటల నమోదు పరిశీలన



పంటల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

**బోయినపల్లి:** మండలంలోని దుండ్రపల్లి గ్రామంలో యాసంగిలో పంటల నమోదు ప్రక్రియను వేములవాడ ఏడీఏ భాస్కర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 20 సర్వే నంబర్లలో రైతులు వేసిన పంటలను ప్రత్యక్షంగా చూశారు. పొలాల్లో పురుగు ఆశిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఏఈవో సాహితీ ఉన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**సిరిసిల్లఅర్బన్:** సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం తంగళ్లపల్లిలోని మార్కండేయ దేవాలయంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పిలుపునిచ్చారు. మంగళవారం సమావేశానికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందన్నారు. నాయకులు కుడిక్యాల కనకయ్య, రాజమల్లు, గడ్డం రాజశేఖర్, వేణు, శేఖర్, గుర్రం బాబు పాల్గొన్నారు.

# సంతోషం ఉప్పొంగిన వేళ

- ట్యాబ్‌లతో సంబురం
- మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అందుకున్న విద్యార్థులు

**ఎల్లారెడ్డిపేట:** ఒక్కసారిగా వారి కళ్లు చెమ్మగిల్లాయి. ఊహించని రీతిలో వారి చేతికి విలువైన సమాచారంతో కూడిన ట్యాబ్‌లు ఇవ్వడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ఐఐటీ, నీట్ ఎంట్రన్స్‌ల తోపాటు ఇతర రంగాల్లో పోటీ ప్రపంచంలో రాణించేందుకు వీలుగా ఎల్లారెడ్డిపేట జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం స్మైల్ ఏ గిఫ్ట్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 2 వేల మంది విద్యార్థులకు మంత్రి కేటీఆర్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సంతోషంలో మంత్రి కేటీఆర్‌కు షేక్‌హ్యాండ్ ఇస్తూ ఆయనతో సెల్ఫీ తీసుకొని సంబరపడ్డారు. దాదాపు రూ.86 వేల విలువ చేసే ట్యాబ్ తమకు అందించి, తమ ఉన్నతికి పాటుపడిన మంత్రికి ఏవిధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియక ఆరాటపడ్డారు. ట్యాబ్‌లు తీసుకుంటున్న సందర్భంలో విద్యార్థుల కేరింతలు, సభికుల హర్షధ్వానాలతో దద్దరిల్లింది.



మంత్రి కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు



ట్యాబ్‌లతో విద్యార్థినులు

### పోటీ పరీక్షల్లో రాణిస్తాం

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపడ్డ తాము ఇకనుంచి ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుంటూ పోటీ పరీక్షల్లో రాణిస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. పోటీ ప్రపంచంలో ఆదర్శ పౌరులుగా ఎదుగుతామన్నారు. మంత్రి కేటీఆర్ విద్యార్థులతో దాదాపు 45 నిమిషాలు గడిపారు. మంత్రి తమతో గడిపిన సమయాన్ని జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకంగా ఉంటుందన్నారు.

### ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ''దాదాపు రూ.86 వేల విలువ చేసే ట్యాబ్‌లను ఉచితంగా మీ చేతుల్లో పెడుతున్నాం. మీరందరూ బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకుంటే మేము గర్వపడతామన్నారు.'' అలాగు వీటిని సమర్థవంతంగా చదువుల కోసం వినియోగించుకోవాలని, ఇంటర్నెట్, ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ వంటి అడ్డమైన కార్యక్రమాలు ఉపయోగించొద్దని మంత్రి సూచించారు. ట్యాబ్ విలువ రూ.10 వేలు అయినా, వాటిలో మెటీరియల్ విలువ రూ.76 వేలు ఉంటుందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.25.80 కోట్ల విలువ చేసే 3 వేల ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో మరో 3 వేల ట్యాబ్‌లను విద్యార్థులకు అందిస్తామని ప్రకటించారు.

### సంతోషంగా ఉంది



ట్యాబ్‌లు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మొన్నటి వరకు పుస్తకాలతో పోటీపడిన మేము ఇక అధునాతన సాంకేతికతను ఉపయోగించుకొని చదువులో రాణిస్తాం. ట్యాబ్‌లు అందించిన మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటాం.

– టేకురాల అక్షయ, సముద్రలింగాపూర్

### జిల్లాకు పేరు తెస్తాం



ట్యాబ్‌లను వినియోగించుకొని ఉత్తమ ర్యాంక్‌లతో జిల్లాకు పేరు తెస్తాం. పేద విద్యార్థులకు ఖరీదైన ట్యాబ్‌లు అందించడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– కె.పూజ, బండలింగంపల్లి

### పోటీ పరీక్షల్లో రాణిస్తాం



ఇప్పటి వరకు పుస్తకాలు, ఇప్పుడు కార్పొరేట్‌కు ధీటుగా ట్యాబ్‌ల ద్వారా చదువుకొని పోటీ పరీక్షల్లో రాణిస్తాం. ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతాం. గిఫ్ట్ ఏ స్మైల్ నిర్వాహకులకు కృతజ్ఞతలు.

– కె.మంజుల, ఎల్లారెడ్డిపేట

## సమాచారం

### 5న గురుకుల ప్రవేశ పరీక్ష

**గంభీరావుపేట:** మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 5న నిర్వహించబోయే గురుకుల ప్రవేశ పరీక్షకు సీవోఈ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు సకాలంలో హాజరుకావాలని కోరారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు విధిగా హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, బ్లూ లేక బ్లాక్ పెన్నులు తెచ్చుకోవాలని సూచించారు.

## నియామకం

### పోచమ్మ ఆలయ కమిటీ

**కోనరావుపేట:** మండలం ధర్మారం గ్రామ పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా జగిడి బాపురెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వెలిశాల రవి, ప్రధానకార్యదర్శిగా ఆసరి ఎల్లయ్య, కోశాధికారిగా మండల శ్రీనివాస్, బుజ్జయ్య, ప్రధాన సలహాదారుడిగా గున్నాల లక్ష్మణ్, కార్యదర్శిగా బాబు, కార్యవర్గసభ్యులుగా అతికం శ్రీనివాస్, పి. గోపి, చాకలి రమేశ్, కుమ్మరి ఎల్లయ్య, లింగయ్య, దేవయ్య, బక్కయ్య, బాబు, ఇప్ప రాములు ఎన్నికయ్యారు.

### నిర్వీర్యమవుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ



మాట్లాడుతున్న రాములు

**సిరిసిల్లఅర్బన్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. సుభాష్‌నగర్‌లోని ఏఐటీయూసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు ద్వారా తొమ్మిది రకాల సరుకులను ఇవ్వకుండా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుందన్నారు. దీంతో నిరుపేదలు అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, అన్ని రకాల సరుకులను పంపిణీ చేయాలన్నారు. లేనియెడల ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం పాల్గొన్నారు.

## ప్రీతికి నివాళి



**ముస్తాబాద్:** మెడికో ప్రీతికి ముస్తాబాద్‌లో బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా నివాళి అర్పించారు. కొవ్వొత్తులతో కొత్త బస్టాండ్ నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రీతి చిత్రపటానికి పూలమాలలు వేశారు. వైద్యాధికారి చందర్‌నాయక్, బంజార సేవా సంఘం మండల అధ్యక్షుడు సర్పంలు, బీజేపీ పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్, సంతోష్‌రెడ్డి, గురు బాబునాయక్, కపూర్‌నాయక్, దేవేందర్, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్



### కేజ్‌వీల్స్‌తో రహదారుల నాశనం

**కోనరావుపేట:** మండలంలోని పలు గ్రామాల రహదారులు కేజ్ వీల్స్ కారణంగా దెబ్బతింటున్నాయి. పదికాలాల పాటు మన్నాల్సిన రహదారులు పనికిరాకుండా పోతున్నాయి. రహదారులపై కేజీవీల్స్‌ను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యపై ప్రశ్నించాల్సిన అధికారి: మనోహర్, ఏఈ, పంచాయతీరాజ్, ఫోన్ నెం. 62816 63292

### దివ్యాంగులకు ఫిజియోథెరపీ పరీక్షలు



ఫిజియోథెరపీ చేస్తున్న రాజేశ్

**గంభీరావుపేట:** మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగులు) విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో చాలా మార్పు కలుగుతోందని తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు రాజేశ్, ఐఈఆర్‌టీ రేణుక పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు



వీర్నపల్లి: ఎగ్జిబిట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**వేములవాడఅర్బన్/వీర్నపల్లి/గంభీరావుపేట/కోనరావుపేట/ఇల్లంతకుంట/చందుర్తి/ముస్తాబాద్:** జిల్లాలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థుల ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు ముగ్గులు, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

### శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి



ఎగ్జిబిట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

**బోయినపల్లి:** విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం వేములవాడలో ఉన్న బోయినపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఆలోచనా విధానంలో సైన్స్ ఉండాలన్నారు.

# యాజమాన్య పద్ధతులపై అవగాహన

**సిరిసిల్లఅర్బన్:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలో సకశేరుక చీడల యజమాన్య పద్ధతులపై కళాశాల ప్రొఫెసర్లు రైతులకు అవగాహన కల్పించారు. కోతులు, అడవి పందుల బారి నుంచి పంటలను ఏవిధంగా రక్షించుకోవాలో తెలిపారు. విశ్వవిద్యాలయం రూపొందించిన అగ్రిసోలార్, ఆర్తనాథ జీవయంత్రం, సౌరశక్తి కంచె, రిబ్బన్ పద్ధతులపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగ అధికారి రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్లు అరుణ, భారతి, సతీశ్, మాధవి, ఏఈవో చంద్రప్రకాశ్, రైతులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారి

### ఆడబిడ్డకు ఆర్థికసాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న యువకులు

**చందుర్తి:** కట్టుకున్న భర్త మృతి చెందగా, పిల్లలను పోషించలేక నిస్సాహురాలుగా ఉన్న మండలం లింగంపేట గ్రామానికి చెందిన గుడిపెల్లి రజితకు ఆ గ్రామానికి చెందిన యువకులు అండగా నిలిచారు. ముగ్గురు పిల్లల పోషణ భారమై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామస్తులు స్పందించి రూ.21,500 నగదు జమ చేసి ఆమెకు అందజేశారు. ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు, యువకులు కర్ల శ్రీనివాస్, చిలువేరి రవి, బొజ్జ వెంకటేశ్, ఇందూరి రాజు, గుంట అనిల్, ఈగ శ్రీనివాస్, కర్ల మహేందర్, ఈగ రాజు ఉన్నారు.

# కంటి వెలుగు శిబిరం

**సిరిసిల్లఅర్బన్:** తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ పడిగెల మానస మంగళవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ మిట్టపల్లి పద్మ, ఎంపీటీసీ కుంటయ్య, ఉపసర్పంచ్ వేణు, నాయకులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని దుమాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ కదిరే రజిత మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ హన్మంతు, నాయకులు పాల్గొన్నారు.

**వేములవాడరూరల్:** మండలంలోని నాగాయపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమన్, మల్లేశం, వైద్యాధికారులు పాల్గొన్నారు.



కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ

**పరిశీలించిన తహసీల్దార్**

**వీర్నపల్లి:** వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్, ఏఎన్‌ఎం మంజుల, వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

### పౌరహక్కుల దినోత్సవం

**బోయినపల్లి:** జిల్లాలోని పలు గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్, మండల సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, సర్పంచ్ గుంటి లతశ్రీ, ఆర్ఐ భూపేశ్, ఐకేపీ ఏపీఎం కాంపెల్లి నర్సయ్య, పాల్గొన్నారు.

**ఇల్లంతకుంట:** మండలంలోని వంతడుపుల గ్రామంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పసుల బాలరాజు, సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.



వీర్నపల్లి: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

**రుద్రంగి:** మండలంలోని వీరునితండా గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య పాల్గొన్నారు.

**వీర్నపల్లి:** మండలంలోని గర్జనపల్లి గ్రామంలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, సర్పంచ్ కరుణ రంజిత్, ఉప సర్పంచ్ రామస్వామి, డైరెక్టర్ ఆనందం, ఫీల్డ్ అసిస్టెంట్ దేవేందర పాల్గొన్నారు.

### ప్రీతి కుటుంబాన్ని పరామర్శించరా?



సమావేశంలో మాట్లాడుతున్న అల్లాడి రమేశ్

**రుద్రంగి:** ర్యాగింగ్ భూతానికి బలైన ప్రీతి కుటుంబ సభ్యులను మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్ కనీసం పరామర్శించకపోవడం బాధాకరమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, మాజీ సెస్ డైరెక్టర్ అల్లాడి రమేశ్ ప్రశ్నించారు. మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రుద్రంగి గ్రామాన్ని దత్తత తీసుకున్నారన్న సంగతి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మర్చిపోయినట్టున్నారని, ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వారి కంటికి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గూడు లేని నిరుపేదలకు సొంతింటి కళను నెరవేరుస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ కళగానే మిగిలిందన్నారు.

### హుండీ లెక్కింపు

**ఇల్లంతకుంట:** మండలంలోని అనంతగిరి పోచమ్మ ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఈ మూడు మాసాలకు గాను రూ.4.77 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మారుతిరావు తెలిపారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని బండలింగంపల్లి, ధూమాల గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచులు కదిరే రజిత, కొత్తపల్లి వాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కదిరి భాస్కర్, పద్మ, నాయకులు పాల్గొన్నారు.

### అరెస్టులు అప్రజాస్వామికం

**ఎల్లారెడ్డిపేట:** జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న ప్రతీసారి ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టులు చేస్తూ ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలో మంగళవారం మంత్రి కేటీఆర్ పర్యటన పురస్కరించుకొని తెల్లవారుజామున తమ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అరెస్టు అయిన వారిలో కిరణ్ నాయక్, ఎలేందర్, దాసరి గణేశ్, తిరుపతి ఉన్నారు.

### చేసిన సేవలు గుర్తుండిపోతాయి

**వేములవాడ:** ప్రభుత్వ ఉద్యోగులు చేసిన సేవలను ప్రజలంతా గుర్తు చేసుకుంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేశ్ అన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్యం కార్మికురాలిగా విధులు నిర్వహించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన కోరెపు దేవమ్మ కుటుంబ సభ్యులను వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ సంపత్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది దేవమ్మను సన్మానించారు.

### ఆలయ డైరెక్టర్ల ఎన్నికపై హర్షం

**కోనరావుపేట:** అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్లుగా సిద్ధంశెట్టి శ్రీనివాస్ (ధర్మారం), తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్(కొలనూర్) ఎన్నిక కావడంపై ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన ఇద్దరు ఎంపిక కావడంపై మండల ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

### ఘనంగా టైలర్స్ డే

**రుద్రంగి:** మండల కేంద్రంలో మంగళవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. టైలరింగ్ మహిళలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పాల్గొన్నారు.

**బోయినపల్లి:** మండల కేంద్రంలో మంగళవారం దర్జీలు టేలర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య, ఉపాధ్యక్షుడు మాడిశెట్టి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.